పేదల కల సాకారం దిశగా..

చీరాల అర్బన్, న్యూస్‌టుడే



గత ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణం ముందుకు సాగలేదు. పేదలకు మేలు చేస్తున్నామని ఆర్భాటపు ప్రకటనలు చేశారే తప్ప.. ఆచరణలో ఇళ్ల నిర్మాణం అంతంత మాత్రమే. నిలువ నీడ లేని వారికి సొంతింటి కల నిర్మాణం సాకారమయ్యేలా కూటమి సర్కారు దృష్టి సారించింది.. దశల వారీగా వీటిని పూర్తి చేయాలనే సంకల్పంతో ముందుకెళుతోంది... వైకాపా పాలనలో ఆప్షన్-3 ద్వారా గుత్తేదారులకు నిర్మాణ బాధ్యతలు అప్పగించడంతో ఆ పార్టీ నేతలు అందినకాడికి దండుకున్నారనే అపవాదు ఉంది... ఈ విధానానికి స్వస్తి పలికి లబ్ధిదారులను భాగస్వాములను చేసి ఇళ్లను పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది.

ఇళ్ల నిర్మాణంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

2016-17 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ఎన్టీఆర్ గృహాల పేరిట నివేశనస్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేసింది. వీటిలో చాలా వరకు పూర్తికాగా, కొన్ని నిలిచిపోయాయి. ఇంతలో గృహాలను 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా సర్కారు అసలు పట్టించుకోలేదు. కనీసం బకాయిలున్న బిల్లులు సైతం చెల్లించకపోవడంతో ఆ గృహాలను చాలా మంది అప్పులు చేసి పూర్తి చేసుకున్నారు. స్తోమత లేని వారు నేటికి పూర్తి చేయని పరిస్థితి. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ గృహాలతో పాటు నవరత్నాల పేరిట గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను పూర్తి చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు వీటిని పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆ శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీనికి 'మన ఇల్లు-మన గౌరవం' పేరుతో ఈనెల 21 జిల్లా స్థాయిలో కలెక్టర్ గృహ నిర్మాణ శాఖాధికారులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. అనంతరం నియోజకవర్గ, మండలస్థాయి అధికారులు సమావేశాలు నిర్వహించారు. ప్రతి వంద రోజులకు నిర్దిష్ట సంఖ్యలో గృహాల నిర్మాణం దశల వారీగా పూర్తిచేయాలని నిర్ణయించారు. ఆమేరకు ఇళ్ల నిర్మాణంలో ఉన్న అడ్డంకులు తొలగించి చురుగ్గా పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు.

జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో 50,415 గృహాలు మంజూరు చేశారు. లబ్ధిదారులకు పట్టణ ప్రాంతంలో ఒక సెంటు, గ్రామాల్లో సెంటున్నర స్థలం ఇచ్చి ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా ఆదేశించారు. ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన కింద ఒక్కో ఇంటికి కేంద్ర ప్రభుత్వమే రూ. 1.80 లక్షల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులు తామే ఇస్తున్నామని ఆనాడు వైకాపా ప్రభుత్వం ప్రచారం చేసింది. అయినా సకాలంలో వీటిని పూర్తి చేయలేదు. ఇప్పటి వరకు 18,534 మాత్రమే పూర్తయ్యాయి.

జిల్లాలో గృహాల నిర్మాణం ఇలా..

- ❖ పునాదిస్థాయి కంటే తక్కువగా ఉన్నవి(బీబీఎల్): 16,088
- ❖ పునాది స్థాయి (బీఎల్): 4942
- ❖ లెంటిల్ లెవెల్(ఎల్ఎల్): 3436
- ❖ రూఫ్‌లెవల్ (ఆర్ఎల్): 1857
- ❖ రూఫ్ కాస్టింగ్ (ఆర్‌సీ): 1916
- ❖ పనులు మొదలెట్టని గృహాలు: 7005

గృహ నిర్మాణాలు వేగవంతం : కలెక్టర్

బాపట్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుని సొంతింటి కల సాకారం చేసుకోవాలని కలెక్టర్ వెంకట మురళి అన్నారు. బాపట్ల పట్టణం మూలపాలెం పీఎంఏవై-ఎన్టీఆర్ గృహకల్ప నగర్‌లో మన ఇల్లు - మన గౌరవం పేరుతో లబ్ధిదారులకు అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 3,436 ఇళ్లు గోడలు, శ్లాబ్ స్థాయిలో ఉన్నాయని తెలిపారు. వీటి నిర్మాణాన్ని ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ దశల్లో ఉన్న 18,256 ఇళ్లను 2025 మార్చి నాటికి పూర్తి చేయాలన్నారు. లేకుంటే కేంద్రం నుంచి వచ్చే నిధులు ఆగిపోతాయన్నారు. నిర్మాణంలో ఉన్న ఇంటికి స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేయిస్తామన్నారు. గృహ నిర్మాణాలు వేగంగా జరిగేలా పర్యవేక్షించేందుకు ప్రతి మండలం, సచివాలయం, లేఔట్‌కు ప్రత్యేకాధికారులను నియమిస్తున్నట్లు చెప్పారు. ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన ఇసుక, సిమెంటు, ఇనుమును లబ్ధిదారులకు అందుబాటులో ఉంచామన్నారు. బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బిల్లులు సకాలంలో చెల్లించాలన్నారు. మూలపాలెం లేఔట్‌లో 1,054 గృహాలు మంజూరు చేయగా ప్రస్తుతం 297 ఇళ్లు నిర్మించినట్లు తెలిపారు. మిగిలినవన్నీ పునాది, గోడలు, శ్లాబ్ స్థాయిలో నిలిచాయన్నారు. వాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణ శాఖ పీడీ ప్రసాద్, ఆర్డీవో గ్లోరియా, పురపాలక కమిషనర్ నిర్మల్‌కుమార్, డీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుల సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకట మురళి

చట్టబద్ధంగానే భూ బదలాయింపులు

బాపట్ల, న్యూస్‌టుడే: నిషేధిత భూముల జాబితా 22ఏ నుంచి 22ఇ వరకు జరిగిన భూమి రిజిస్ట్రేషన్, బదలాయింపులన్నీ జిల్లాలో చట్టబద్ధంగానే సాగాయని కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. అమరావతి నుంచి సీసీఎల్ఏ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా నిర్వహించిన వీక్షణ సమావేశంలో కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జేసీ శనివారం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూముల క్రయవిక్రయాలు, క్రమ పద్ధతిలో రిజిస్ట్రేషన్లు జరిగాయని పేర్కొన్నారు. జిల్లాలో 22ఏ జాబితా నుంచి 6,363 ఎకరాలు తొలగించారని తెలిపారు. 818 ఎకరాల అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు, 25 ఎకరాలు చట్టబద్ధంగా బదలాయింపులు జరిగినట్లు వివరించారు. చుక్కల భూముల కింద 1089 ఎకరాలు తొలగించి, 23 ఎకరాల మార్పిడి జరిగిందన్నారు. నిబంధనల ప్రకారమే 178 ఎకరాల భూ దస్త్రాల్లో మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. సర్వీస్ ఈనాం భూముల్లో ఎలాంటి మార్పులు జరగలేదన్నారు. డీఆర్వో సత్తిబాబు, ఉప కలెక్టర్ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.



మెప్మా అర్బన్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న పురపాలక కమిషనర్ రవీంద్ర

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

అద్దంకి, న్యూస్‌టుడే: మహిళలు స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని పురపాలక కమిషనర్ డి.రవీంద్ర అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్‌ను శనివారం మధ్యాహ్నం పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో ప్రారంభించారు. ఐదేళ్ల వైకాపా ప్రభుత్వ కాలంలో ఇలాంటి మార్కెట్‌లు ఏర్పాటు తక్కువే. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఇలాంటివి పునఃప్రారంభించారు. ముఖ్యఅతిథి కమిషనర్ మాట్లాడుతూ ఇంటి వద్ద తయారు చేసే జనపనార సంచులు, దుస్తులు, విదేశాలకు పంపించే ఆహార పదార్థాలు, కాలానుగుణంగా అమ్ముకునే వస్తువుల్ని అందంగా తయారు చేస్తున్న మహిళలు తమ నైపుణ్యాలను వెలికి తీయాలన్నారు. మెప్మా సీఈవో శ్రీలత మాట్లాడుతూ పొదుపు మహిళలు సొంతంగా తయారు చేసే వస్తువుల్ని ఈ మార్కెట్‌లో అమ్ముకునేందుకు చక్కని అవకాశాన్ని ప్రభుత్వం కల్పించినట్లు వివరించారు. ఎన్టీఆర్ నగర్‌కు చెందిన వృద్ధురాలు కుల్ఫంబీ తయారుచేసిన ఫ్లవర్ బొకే ఆకట్టుకుంది. మొత్తం 40మంది పొదుపు మహిళలు తాము తయారు చేసిన వస్తువుల్ని విక్రయించారు. ప్రతినెలా రెండురోజుల పాటు ఇలాంటి ప్రదర్శన పురపాలక సంఘం పరిధిలో జరుగుతుందని సీఈవో తెలిపారు.

జిల్లా స్థాయి పోటీల్లో ఉల్లిపాలెం విద్యార్థుల ప్రతిభ

బాపట్ల, న్యూస్‌టుడే: వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూపొందిస్తున్న స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో అందరూ భాగస్వాములై తమ అభిప్రాయాలు, ఆలోచనలు తెలియజేయాలని డీఈవో నారాయణ అన్నారు. పురపాలక ఉన్నత పాఠశాలలో స్వర్ణాంధ్ర 2047 విజన్‌పై జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలను ఆయన శనివారం ప్రారంభించారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపి నగరం మండలం ఉల్లిపాలెం విద్యార్థిని కె.లక్ష్మీ సింధూర ప్రథమ, సరస్వతీ స్మారక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని కె.జహూరా ద్వితీయ, జేపంగులూరు మండలం బూదవాడ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్‌కే సమీరా తృతీయ స్థానం సాధించారు. వక్తృత్వంలో నగరం మండలం ఉల్లిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని జి.కవిత ప్రథమ, భట్టిప్రోలు మండలం సూరేపల్లి వీపీఅండ్‌జీఎస్‌ఎం ఉన్నత పాఠశాల విద్యార్థిని నవ్య ద్వితీయ, చీరాల మండలం ఈపూరుపాలేనికి చెందిన విద్యార్థిని కె.తేజశ్వి తృతీయ స్థానంలో నిలిచారు. డిబేట్‌లో జేపంగులూరు మండలం చందలూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సీహెచ్ గాయత్రి, ఎస్.దీపిక ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. చీరాల ఏఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కే.లక్ష్మీభార్గవి, ఎ.అభిషేక్ ద్వితీయ, బాపట్ల అంబేడ్కర్ గురుకులం విద్యార్థులు జె.షణ్ముఖప్రియ, వై.పూజిత మేరీ తృతీయ స్థానం సాధించారు. విజేతలను డీఈవో అభినందించారు. సీపీవో కె.శ్రీనివాసరావు, డీవైఈవో జి.వెంకటేశ్వర్లు, ఎంఈవోలు ఎస్.నిరంజన్, డి.ప్రసాదరావు, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్ తదితరులు పాల్గొన్నారు.



వక్తృత్వ పోటీలో విద్యార్థిని చెబుతున్న అంశాన్ని వింటున్న డీఈవో నారాయణ

చంపుతానంటూ మైనార్టీ నాయకుడికి బెదిరింపు

వేమూరు వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జిపై ఫిర్యాదు

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: వైకాపా జిల్లా అధ్యక్షుడిగా మేరుగ నాగార్జునను నియమించిన సందర్భంగా సెల్‌ఫోన్‌లో అభినందనలు తెలిపినందుకు తనను వేమూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు చంపుతానని బెదిరించారని భట్టిప్రోలు మండల కో-ఆప్షన్ సభ్యుడు, అదే పార్టీకి చెందిన మైనార్టీ నాయకుడు షేక్ సలీం శనివారం స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సలీం విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 27న అర్ధరాత్రి సమయంలో అశోక్‌బాబు ఫోన్ చేసి తాను ఓడిపోవటానికి నాగార్జున, నువ్వే కారణమంటూ అసభ్యంగా మాట్లాడారని తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నాగార్జునను నియమించిన విషయమై వైకాపా అధినేత జగన్ వద్దే తేల్చుకుంటానని చెప్పినట్లు పేర్కొన్నారు. ఇలా ఫోన్‌లో మాట్లాడుతూ ఉండగానే అప్పటికే కాన్ఫరెన్స్‌లో ఉన్న అమృతలూరు మండల నాయకుడు మోదుకూరి హరిబాబు, అశోక్‌బాబు కుమారుడు శ్రీతేజ, అద్దేపల్లికి చెందిన దాసరి కిరణ్ కల్పించుకుని ఎక్కడ ఉన్నావో చెబితే కాళ్లు, చేతులు కట్టి కారుతో ఈడ్చుకెళతామని బెదిరించినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో తెదేపాకు అనుకూలంగా పనిచేసి, వైకాపాకు ద్రోహం చేశావంటూ అసభ్య పదజాలంతో దూషించారని వివరించారు. తాను వైకాపా ఆవిర్భావం నుంచి పార్టీ కోసమే పనిచేశానని, వేరే జిల్లా నుంచి ఇక్కడకు వలస వచ్చిన అశోక్‌బాబు పార్టీని భ్రష్టు పట్టించారని విమర్శించారు. ఆయన వల్లే పార్టీలో ఉన్నవారు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని, ప్రజారాజ్యం పార్టీ నుంచి వైకాపాలోకి వచ్చిన అశోక్‌బాబుకు తనను విమర్శించే అర్హత లేదని వివరించారు. తనపై దాడి చేస్తే చూస్తూ ఊరుకోనని, ప్రతి దాడి చేస్తానని వారిని హెచ్చరించారు. తనకు, తన కుటుంబ సభ్యులకు పోలీసులు రక్షణ కల్పించాలని ఫిర్యాదులో కోరారు. పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయటానికి వెళితే ఎస్సై, పోలీసులు అందుబాటులో లేరు. దీంతో ఫిర్యాదును అందుబాటులో ఉన్న ఓ కానిస్టేబుల్‌కు అందించారు.



పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు పత్రం చూపుతున్న వైకాపా నాయకుడు సలీం

టెట్ పరీక్షలకు ఏర్పాట్లు

గుంటూరు: అక్టోబర్ 3వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరగనున్న ఏపీ టెట్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డీఆర్‌వో ఛాంబర్‌లో శనివారం టెట్ పరీక్షల నిర్వహణపై అనుబంధ శాఖల అధికారులతో సమావేశం జరిగింది.

ఈవీఎం యంత్రాల పరిశీలన

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని మార్కెట్‌యార్డులో ఈవీఎం యంత్రాలు భద్రపరిచిన గోదాము వద్ద పటిష్ఠ భద్రత ఉండాలని కలెక్టర్ వెంకట మురళి అన్నారు. ఈవీఎం భద్రపరిచిన గోదామును ఆయన శనివారం పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు అడిగి తెలుసుకున్నారు. గోదాముల తలుపులు, దస్త్రాలు తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారం గోదాముల్లో గదులకు సీల్ వేశారా లేదా అని పరిశీలించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. డీఆర్వో సత్తిబాబు, ఆర్డీవో గ్లోరియా, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాతి ముఖమండపం నిర్మాణానికి రూ.3,33,333 విరాళం

శింగరకొండ (అద్దంకి), న్యూస్‌టుడే: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం రాతి ముఖమండపం నిర్మాణానికి హైదరాబాద్‌లో నివసించే జమ్ములమడక వెంకట శ్రీనివాస నాగేంద్ర-మాధురి దంపతులు రూ. 3,33,333 విరాళం అందించారు. గుడికి వచ్చిన దాతలు స్వామి వారి దర్శనానంతరం విరాళం చెక్కును సహాయ కమిషనర్ ఎం.తిమ్మానాయుడుకు అందజేశారు. ఆమేరకు తగిన రసీదును సహాయ కమిషనర్ వారికి అందించారు. వీరికి పూజలు చేయించి స్వామివారి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలు అందించారు. వేదపండితులు శేషవస్త్రం సమర్పించి ఆశీర్వదించారు.



దాత నుంచి విరాళం చెక్కు అందుకుంటున్న సహాయ కమిషనర్ తిమ్మానాయుడు

బాలిక మేఘన మృతిపై విచారణ

మార్టూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఇసుకదర్శికి చెందిన విద్యార్థి మేఘన మృతిపై శనివారం జిల్లా వైద్యబృంద అధికారులు పరిశీలన జరిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న మేఘన జ్వరంతో మృతిచెందినట్లు 'ఈనాడు'లో శనివారం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ బాపట్ల నుంచి డాక్టర్ పి.వెంకటేశ్వర్లు ఇసుకదర్శి విచ్చేసి, బాలిక తల్లిదండ్రుల నుంచి సమాచారం సేకరించారు. అనంతరం గ్రామంలో మెరుగైన పారిశుధ్యం కల్పించేలా స్థానిక ప్రజా ప్రతినిధులకు తెలిపినట్లు తెలిపారు. ఆరోగ్య సిబ్బందితో గృహాల సర్వే చేపట్టి జ్వర పీడితులను నమోదు చేసినట్లు తెలిపారు. మురుగు కాల్వల్లో దోమల ప్రబలకుండా లార్వా వదిలినట్లు చెప్పారు. ఆయన వెంట సీహెచ్‌ఓ నాగేశ్వరరావు, డాక్టర్ దివ్యల హరి, ఆంజనేయరావు తదితరులు ఉన్నారు.



బాలిక తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరిస్తున్న వైద్య బృందం

స్థలం అద్దెకిస్తే.. బతుకేలేకుండా చేశాడు

- నగల కోసం వృద్ధురాలి హత్య
- చీరాలలో ఘటన... నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఒకటో పట్టణ సీఐ శ్రీనివాసరావు

జీవనం కోసం వ్యాపారం చేసుకుంటానంటే ఆ వృద్ధురాలు తనకున్న ఖాళీ స్థలాన్ని ఆ వ్యక్తికి అద్దెకిచ్చింది.. అదే ఆమె పాలిట శాపమైంది. ఆర్థిక ఇబ్బందులతో అతడు ఒంటరిగా ఉంటున్న ఆమె నగలపై కన్నేసి అంతమొందించాడు.. ఈ అమానవీయ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ ఘటనలో నిందితులను ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు... కేసుకు సంబంధించిన వివరాలను సీఐ ఎం.శ్రీనివాసరావు శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. పట్టణంలోని ఉజిలిపేటకు చెందిన గుర్రప్పుడి విజయలక్ష్మి(79)కి అదే ప్రాంతంలో ఉన్న ఖాళీ స్థలాన్ని పాపరాజుతోటకు చెందిన పాశం కుమార్ తేజ అద్దెకు తీసుకుని, అందులో టైల్స్ వ్యాపారం చేస్తున్నాడు. ఈనేపథ్యంలో ఆర్థిక సమస్యలు అతడ్ని చుట్టుముట్టాయి. దీనికితోడు స్థలానికి సంబంధించిన అద్దె సక్రమంగా చెల్లించడంలేదు. ఒంటరిగా ఉంటున్న స్థల యజమానురాలికి ఎటువంటి ఇబ్బందుల్లేవు. కుమారుడు, కుమార్తె సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. విజయలక్ష్మి ఒంటిపై బంగారు నగలు ఉన్నాయి... వాటిని కాజేస్తే కొన్నాళ్లు బాధలు తప్పుతాయని భావించిన తేజ ఒక పథకం ప్రకారం ఆమెను హత్య చేయడానికి తనకు తెలిసిన చంద్ర వద్ద విషపదార్థం తీసుకొచ్చాడు. ఈవిషయాన్ని తన వద్ద గుమస్తాగా పనిచేస్తున్న కారంచేడుకు చెందిన యార్లగడ్డ రాముకు చెప్పి తనకు సహకరిస్తే కొంత నగదు ఇస్తానని ఆశచూపించాడు.



విజయలక్ష్మి (పాత చిత్రం)

పెట్రోల్ పోసి కాల్చేసి..

పథకాన్ని అమలు చేసే పనిలో భాగంగా ఈనెల 15న మధ్యాహ్నం రెండు గంటల సమయంలో విజయలక్ష్మిని దుకాణం వద్దకు రావాలని గుమస్తా వెళ్లి చెప్పడంతో ఆమె వచ్చింది. అప్పటికే విషం కలిపి సిద్ధంగా ఉంచిన శీతల పానీయాన్ని తేజ వృద్ధురాలికి ఇవ్వడంతో అది తాగిన కొద్దిసేపటికి మృతిచెందింది. అనంతరం ఆమె మెడలో ఉన్న బంగారు నగలు తీసుకొని తేజ స్థానికంగా ఉన్న బంగారు దుకాణంలో రూ. 1,70,000కు తాకట్టుపెట్టాడు. ఆ డబ్బుతో వచ్చి మృతదేహాన్ని ఓ కారు(ఏపీ39కేఎఫ్8291)లో రాము సాయంతో ఎక్కించుకుని వినుకొండ మీదుగా వెళుతూ దారిమధ్యలో ఒక పెట్రోలు బంకులో క్యానులో పెట్రోలు పోయించుకున్నాడు. ప్రకాశం జిల్లా దొనకొండ మండలం గంగదేవిపల్లి గ్రామ శివారులో మృతదేహంపై పెట్రోలు పోసి నిప్పంటించి, ఇద్దరు తిరిగి చీరాల వచ్చేశారు. తన తల్లి కనపడటంలేదని మృతురాలి కుమారుడు వెంకటరమణ ఈనెల 19న ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆతరువాత 25న ఫిర్యాదుదారుడు మళ్లీ వచ్చి మా ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా కారులో మా అమ్మను వెనుక సీటులో కూర్చోబెట్టుకుని తేజ, రాము పెట్రోలు కొట్టించుకొని వెళ్లినట్లు దృశ్యాలు ఉన్నాయని చెప్పి, వీరిపై అనుమానంగా ఉందని మళ్లీ ఫిర్యాదు చేశారు. గంగదేవిపల్లి ప్రాంతంలోని ముళ్లపొదల్లో గుర్తు తెలియని మహిళ శవాన్ని కాల్చివేసినట్లుగా అక్కడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈరెండింటిని పరిశీలించగా ఆ మృతదేహం విజయలక్ష్మిదిగా గుర్తించి హత్యకేసుగా నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. నిందితులిద్దరు కారులో స్వర్ణ వైపు నుంచి చీరాల వస్తుండగా అదుపులోకి తీసుకొని విచారించగా హత్యచేసినట్లు ఒప్పుకొన్నట్లు వివరించారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నట్లు ఆయన చెప్పారు.

తండ్రిపై తనయుడి దాడి

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: కుటుంబ గొడవల నేపథ్యంలో తండ్రిపై తనయుడు దాడి చేసి గాయపర్చిన సంఘటన చీరాల మండలం బుర్లవారిపాలెంలో జరిగింది. ఈపూరుపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అంబేడ్కర్ కాలనీకి చెందిన ఏసోబు, సుభాషిణి భార్యాభర్తలు. కలహాల కారణంగా వేరుగా ఉంటున్నారు. వీరి కుమారుడు కరుణ సాగర్ తండ్రి ఏసోబుతో కలిసి నివసిస్తున్నాడు. ఈనెల 25న సాగర్ తన తల్లిని చూడడానికి ఆమె వద్దకు వెళ్లాడు. ఇది ఇష్టం లేని తండ్రి కుమారుడ్ని నిలదీయడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరస్పరం కలబడి కొట్టుకున్నారు. దీంతో ఇద్దరు గాయపడ్డారు. దీనిపై రెండు రోజుల క్రితం కుమారుడు తండ్రిపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒక కేసు నమోదైంది. ఆసుపత్రిలో చికిత్స పొందిన ఏసోబు శనివారం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కుమారుడు తనను క్రికెట్ బ్యాటుతో కొట్టడంతో రెండు వేళ్లు విరిగిపోయాయని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరద ఊడ్చేసింది - చెట్టే నివాసమైంది

అధికారులూ.. ఈ అభాగ్యుల్ని పట్టించుకోరూ..?

కొల్లూరు, న్యూస్‌టుడే:

ఇటీవల కృష్ణానదికి సంభవించిన వరదలు సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు. జిల్లాలోని లంక గ్రామాల్లో ప్రతి ఒక్కరూ వరదల దెబ్బకు విలవిలలాడిన వారే. వరదలు తగ్గి దాదాపు మూడు వారాలు కావస్తున్నా ఆ వరదలు మిగిల్చిన విషాదం ఇప్పటికీ వెంటాడుతూనే ఉంది. వీరిలో కొందరి పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. కొల్లూరు కరకట్ట దిగువన పెసర్లంక రహదారికి సమీపంలోని ఓ ఇటుక కల్లంలో నిర్మించుకున్న మూడు పూరిపాకల్లో రెక్కాడితే గాని డొక్కాడని మూడు కుంటుంబాల వారు నివాసం ఉంటున్నారు. ఏళ్ల తరబడి ఇరుగూ పొరుగై కలిసిమెలసి జీవిస్తుండడమే వీరి మధ్య ఉన్న బంధం, బంధుత్వం. తెలుగు రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాల నుంచి పొట్ట చేత బట్టుకుని బతుకుదెరువు కోసం ఇక్కడకు వచ్చి చేరారు. ఓ ఇటుక కల్లం యజమాని దయతో ఆయన కల్లంలో పూరిపాకలు వేసుకుని విద్యుత్తు సౌకర్యానికి కూడా నోచుకోక 13 ఏళ్లుగా నివాసం ఉంటున్నారు. హోటళ్లు, ఇటుక కల్లాలు, పొలాల్లో చేసుకునే కూలి పనుల ద్వారా రోజువారీ వచ్చే ఆదాయమే వీరికి జీవనాధారం. ఈ నెల 1న సాయంత్రం వీరి నివాసాలను ఒక్కసారిగా వరద నీరు చుట్టుముట్టింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని వీరిని వరద బాధితుల శిబిరానికి పంపారు. వరద తగ్గిన తరువాత చూస్తే రెండు పూరి పాకల పైకప్పు వరద నీటిలో కొట్టుకుపోయి, గోడలుగా పేర్చుకున్న ఇటుకలు గుట్టగా పోగు పడి కనిపించాయి. వేప చెట్టు అడ్డుగా ఉండడంతో మరో పాక పాక్షికంగా మిగిలింది. ఈ మూడు నివాసాల్లోని సామాన్లు ఒక్కటి కూడా మిగలకుండా కొట్టుకు పోయాయి. నివాసాల వద్ద ఉన్న వేప చెట్టే వీరికి నివాసమైంది. అయినా వీరిని పట్టించుకున్న వారే కరవయ్యారు. వరద బాధితులకు అధికారులు పంపిణీ చేసిన నిత్యావసరాల్లో గుప్పెడు బియ్యం కాదు కదా గుక్కెడు మంచి నీరు కూడా వీరికి దక్కలేదు. కష్టం చేసి కడుపు నింపుకుందామంటే వరద పుణ్యమాని కూలి పనులు కనిపించలేదు. దొరికిన పూట తిని, దొరకని పూట పస్తులుంటూ కటిక చీకటిలో చెట్టుకిందే కాలం నెట్టుకొస్తున్నారు. ఆ మూడు కుటుబాల గాథ ఇలా..

వృద్ధురాలి ఉసురు తీసింది



మృత్యువుతో పోరాటం చేస్తున్న వృద్ధురాలు

తెలంగాణ నుంచి వచ్చి కొల్లూరు కరకట్ట కింద స్థిరపడిన సుమారు 75ఏళ్ల బండ్లమూడి నాగమ్మ ఒంటరి వృద్ధురాలు. ఈమె ఇంటిని వరద ముంచెత్తడంతో ఆపద సమయంలో ఆదుకుంటాయని కూడబెట్టుకున్న కూలి డబ్బులు రూ.30 వేల నగదుతో పాటు సుమారు రూ. 80 వేలు విలువైన బంగారు ఆభరణాలను బియ్యం డబ్బాలో ఉంచి తన నివాసం పక్కన ఉన్న ఊక గుట్టపై పెట్టుకుని వరద పునరావాస కేంద్రానికి వెళ్లిపోయింది. వరద తగ్గిన తరువాత తిరిగొచ్చి చూస్తే ఆ డబ్బాతో పాటు ఇటీవల రూ. 10 వేలు వెచ్చించి వేసుకున్న తాటాకుల ఇంటి కప్పు, ఇంట్లో సామాన్లు మొత్తం వరద పాలయ్యాయి. ఇది చాలదన్నట్లు కనీసం తిండికి కూడా లేని స్థితిలో పట్టించుకునే వారే కనిపించలేదు. దీంతో సుమారు 15 రోజుల పాటు తీవ్ర మానసిక వ్యథ అనుభవించింది. ఫలితంగా ఈ నెల 21న అనారోగ్యానికి గురైంది. ఓ కాలూ చెయ్యీ పనిచేయడం మానేశాయి. కదలలేని స్థితికి చేరుకుంది. ఈమెకు సమీపంలోనే ఓ వృద్ధ జంట వరదకు పాక్షికంగా దెబ్బతిన్న పూరి పాకలో ఆశ్రయం ఇచ్చారు. కటికట నేలపైనే ఆమె మృత్యువుతో పోరాడుతోంది.

తలదాచుకునేందుకు మిగిలింది చెట్టే

★ నెల్లూరు ప్రాంతం నుంచి ఇక్కడకు వలస వచ్చిన చీరాల ఆశీర్వాదం దంపతులు సుమారు 70 ఏళ్లు పైబడిన వృద్ధులు. శక్తిలేక పోయినా భుక్తి తప్పదు కాబట్టి చేతనైన కూలి పనులు చేసుకుంటూ తినీతినక జీవనం గడుపుతున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న నాగమ్మకు ఆశ్రయం ఇచ్చిన పూరి పాక వీరి నివాసం. ఈ దంపతులకు అందిన వరద సహాయం శూన్యం.

★ భర్త లేని కట్టు నూకరత్నం ఉత్తరాంధ్రలో సామర్లకోట నుంచి ఇక్కడకు వలస వచ్చింది. పెళ్లయినా భర్త పట్టించుకోక పుట్టింటికి చేరిన కూతురు, ఆమె ముగ్గురు పిల్లలతో జీవనం సాగిస్తోంది. వరదలో కొట్టుకుపోయిన మూడు పూరి పాకల్లో ఓ పాక ఈమె కుటుంబానికి నివాసం. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభంలో రూ.10 వేలు అప్పుతెచ్చి మరీ పైకప్పు తాటాకులతో వేయించింది. కూలి పనులే వీరికి జీవనాధారం. ఈ కుటుంబానికి వరద సాయం రవ్వంతైనా దక్కలేదు. దీనికి తోడు వరద కారణంగా కూలి పనులు కూడా దొరక్క పోవడంతో ఆకలితో అలమటించే ముగ్గురు పిల్లలకు ముద్ద పెట్టేందుకు ఆ తల్లీకూతుళ్లు నానా తంటాలు పడుతున్నారు.



నాగమ్మను బతికించుకుందామని..

ఇన్నాళ్లూ ఇరుగూ పొరుగై తమతో కలిసి బతికిన నాగమ్మ అచేతన స్థితికి చేరుకోవడంతో ఏం చేయాలో తెలియని అయోమయం మిగిలిన వారిది. వైద్యం చేయించి ఎలాగైనా ఆమె ప్రాణం కాపాడాలనే తపన తప్ప వారి చేతిలో చిల్లి గవ్వలేదు. చెట్టుకిందే ఉంటూ ఆకలితో అలమటించే పరిస్థితిలో ఉన్నా వారు ఆమెను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. తెనాలి వైద్యుల సూచన మేరకు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షలు చేసిన అక్కడి వైద్యులు పెదవి విరిచారు. దీంతో ఆమెను మూడ్రోజుల క్రితం వారి నివాసాల వద్ద ఆవాసంగా మిగిలి ఉన్న చెట్టు కిందకు చేర్చారు. ఆ రోజు అర్ధరాత్రి సమయంలో భారీ వర్షం కురవడంతో వరదలో కొట్టుకు పోకుండా పాక్షికంగా దెబ్బతిని మిగిలి ఉన్న పాకలో ఇటుక రాళ్లు, వాటిపై చాప పరచి పడుకోబెట్టారు. అచేతనంగా ఆ పాకలో పడి ఉన్న ఆమెను అలాగే వదిలేసేందుకు మనస్కరించక కూలి పని చేసి బాకీ తీర్చుతామనే హామీతో ఆ రెండు కుటుంబాల వారు కొందరి వద్ద రూ. 4,300 అప్పుగా తెచ్చి ఓ ప్రైవేటు వైద్యుడి సాయంతో సెలైన్లు ఎక్కించడం మొదలు పెట్టారు. అప్పుగా తెచ్చిన ఆ సొమ్ము కూడా ఖర్చయి పోవడంతో చేసేది లేక మృత్యువుతో పోరాడుతున్న వృద్ధురాలికి మజ్జిగ అందిస్తూ బతికించే ప్రయత్నం చేస్తున్నారు. చీకటి పడితే చాలు ముసురుకునే దోమలు. రాత్రీ పగలు తేడా లేకుండా యథేచ్ఛగా వీరి చుట్టూ సంచరించే విష సర్పాలు, కీటకాలు. రోజుల తరబడి ఇదే స్థితిలో భరోసా లేని బతుకులీడ్చుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు చేతనైన సాయం చేస్తే చాలని వీరు ఎదురుచూస్తున్నారు.

కుక్క కాటు బాధితులకు రేబిస్ వ్యాక్సిన్ తప్పనిసరి

బాపట్ల, న్యూస్‌టుడే: కుక్క కాటుకు గురైన వారు తప్పనిసరిగా రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలని డీఎంహెచ్‌వో విజయమ్మ అన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రపంచ రేబిస్ దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ కుక్క కాటు ప్రమాదకరమన్నారు. మూఢనమ్మకాలతో నాటు వైద్యానికి పరిమితం కారాదన్నారు. సమీపంలోని ఆసుపత్రికి వెళ్లి రేబిస్ నిరోధక వ్యాక్సీన్ తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. దీనిపై ప్రజలకు వైద్య ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. అధికారులు మరియమ్మ, నాగేశ్వరరావు, అరుణ పాల్గొన్నారు.

బాపట్ల, న్యూస్‌టుడే: కుక్క కాటు వల్ల మనుషులకు ప్రాణాంతక రేబిస్ వ్యాధి వస్తుందని పశుసంవర్ధక శాఖ జేడీ బి.వేణుగోపాల్ అన్నారు. ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక పశుసంవర్ధక శాఖ ప్రాంతీయ వైద్యశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కుక్కలకు రేబిస్ నిరోధక టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ రేబిస్ వ్యాధి వల్ల కలిగే మరణాలు ఎక్కువగా కుక్క కాటు వల్ల వస్తున్నాయన్నారు. బాపట్ల పట్టణంతో పాటు గ్రామాల్లో వీధి కుక్కలకు రేబిస్ నిరోధక టీకాలు వేస్తామన్నారు. వీధి శునకాలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేయటానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఏడీ టి. శంకరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో విజయమ్మ


వరిలో జింక్‌లోపం నివారణ చేపట్టాలి

చుండూరు, న్యూస్‌టుడే: వర్షపు నీరు చేరిన వరిలో జింక్ లోపం కనిపిస్తోందని బాపట్ల రైతు శిక్షణ కేంద్రం శాస్త్రవేత్తలు మురళీధర్‌నాయక్, రాధకృష్ణ తెలిపారు. చుండూరులో నీట మునిగిన వరిని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జింక్ లోపానికి, లీటరు నీటిలో 2 గ్రాముల చొప్పున జింక్ సల్ఫేట్‌ను కలిపి పైరుపై పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో ఆదాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.



RAMOJI FILM CITY



సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

నేరాలపై అప్రమత్తత అవసరం



గ్రామస్థులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ విఠలేశ్వర్

అమృతలూరు, న్యూస్‌టుడే: అసాంఘిక కార్యకలాపాలు, నేరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని అదనపు ఎస్పీ విఠలేశ్వర్ అన్నారు. గోవాడలో ఆయన 'పల్లె నిద్ర' నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ సచివాలయంలో గ్రామస్థులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ నేరాలను అరికట్టేందుకు నివాసాలు, వ్యాపార సముదాయాలు, కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దసరా సెలవులకు ఊళ్లు వెళితే బంగారం, నగదు, విలువైన వస్తువులు, దస్త్రాలను బ్యాంకు లాకర్లు, ఇతర సురక్షిత ప్రాంతాల్లో దాచుకోవాలన్నారు. గ్రామంలో కొత్త వ్యక్తుల సంచారం, అసాంఘిక కార్యకలాపాల నిర్వహణపై 112కు తెలపాలని సూచించారు. ఎస్సై అమరవర్ధన్ పాల్గొన్నారు.

నిందితుడి అరెస్టు

పిట్టలవానిపాలెం: మండలంలో సంగుపాలెం, కోమలి గ్రామాల్లో కేబుల్ తీగలు, నీళ్ల మోటార్లను చోరీ చేసిన నిందితుడిని రెడ్డిపాలెం కూడలిలో శనివారం అరెస్టు చేసినట్లు చందోలు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. చీరాలకు చెందిన బెజ్జం అశోక్ నుంచి 5జి నెట్ కేబుల్ తీగలు, మోటారు స్వాధీనం చేసుకుని బాపట్ల కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 126, రిటైల్ ధర - 148, చికెన్ విత్‌స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్ - 244.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 248 చికెన్ స్కిన్‌లెస్ - 258.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 535 (వాణిజ్య & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

బైక్ నుంచి జారి పడి వ్యక్తి మృతి

బాపట్ల పట్టణం: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. చీరాల మండలం బుర్లవారిపాలెంనకు చెందిన బి.రాజేష్(40) పెయింటర్స్ కాలనీలో నివసించేవాడు. పట్టణంలో బియ్యం, చిట్టీలు, ప్రైవేట్ ఫైనాన్స్ వ్యాపారం చేసేవాడు. ఈనెల 25న రాత్రి తన బైక్‌పై జాతీయ రహదారిలో చీరాల వైపు వెళ్తూ బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల వెనుక ప్రమాదవశాత్తు జారిపడడంతో గాయాలయ్యాయి. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మరణించాడు.

ఇసుక అక్రమ తవ్వకాలపై పరిశీలన

వేటపాలెం, న్యూస్‌టుడే: మండలంలోని పందిళ్లపల్లి నుంచి వేటపాలెం స్ట్రయిట్‌కట్ వరకు రైల్వే ట్రాక్ వెంట ఇసుక అక్రమ తవ్వకాలు చేసే ప్రాంతాలను ఆర్డీవో జి.సూర్యనారాయణరెడ్డి రెవెన్యూ, డ్రయినేజీ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. దీనిపై ఇటీవల కలెక్టరు కార్యాలయంలో జరిగిన ప్రజా విజ్ఞప్తుల్లో అందిన ఫిర్యాదు మేరకు ఈప్రాంతాలను అధికారుల బృందం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా తవ్వకాలు జరిగిన భూముల వివరాలు పరిశీలించి సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేయాలని తహసీల్దార్ పార్వతిని ఆర్డీవో ఆదేశించారు. స్ట్రయిట్‌కట్ కరకట్టల నుంచి ఇసుక తరలించిన ప్రాంతాన్ని చూశారు. పోలీసు, రెవెన్యూ, డ్రయినేజీ అధికారుల జాయింట్ ఆపరేషన్ ద్వారా ఈ తవ్వకాలు అరికడతామని, బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన చెప్పారు. పందిళ్లపల్లిలో గడిచిన మూడు దశాబ్దాలుగా ఇసుక రవాణా జరుగుతోందని, దీనిపై సంబంధిత వ్యక్తులను ప్రశ్నిస్తే దాడిచేస్తారని విషయాన్ని వీఆర్వో ఒకరు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కరకట్టల నుంచి ఇసుక అక్రమ తవ్వకాలపై ఫిర్యాదుదారుడు నాగార్జునరెడ్డి, డ్రయినేజీ డీఈ సుబ్బారావుల మధ్య వాగ్వాదం జరిగింది. వీఆర్వో, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



తవ్విన ప్రాంతంలో ఆర్డీవో పాటు ఇతర అధికారులు

హత్యాయత్నం కేసులో బాధితుడికి బెదిరింపులు

మైలవరం(అద్దంకి), న్యూస్‌టుడే: నాలుగేళ్ల క్రితం జరిగిన హత్యాయత్నం కేసులో బాధితుడ్ని మరోమారు బెదిరించిన సంఘటనపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై సీహెచ్.ప్రవీణ అందించిన సమాచారం మేరకు.. మైలవరం గ్రామానికి చెందిన మన్నేపల్లి వెంకటేశ్వర్లుపై 2020లో హత్యాయత్నం జరిగింది. ఈ సంఘటనపై కేసు నమోదు కాగా న్యాయస్థానంలో విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈనెల 23న పొలం వెళుతున్న వెంకటేశ్వర్లును అదే గ్రామానికి చెందిన కుడుములపల్లి సోమయ్య మరో ఏడుగురు దారి కాచి అటకాయించారు. 'మాకు వ్యతిరేకంగా కోర్టులో సాక్ష్యం చెబుతావా' అంటూ దుర్భాషలాడుతూ బెదిరించినట్లు బాధితుడు అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాపట్ల

• బాపట్ల • రేపల్లె • వేమూరు

30న రేపల్లె కౌన్సిల్ సమావేశం

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె పురపాలిక సంఘం కౌన్సిల్ హాలులో ఈ నెల 30న ఉదయం 11 గంటలకు ఛైర్మన్ కట్టా మంగ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరుగుతుందని కమిషనర్ సాంబశివరావు తెలిపారు. ఎజెండాలో పొందుపర్చిన 8 అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు మున్సిపల్ అధికారులు సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

సోదరభావంతో మెలగాలి

బాపట్ల పట్టణం: గ్రామాల్లో వివాదాలు, ఘర్షణలకు పాల్పడకుండా సోదరభావంతో మెలగాలని అర్బన్ రిజర్వు డీఎస్పీ చంద్రమోహన్ అన్నారు. మండల పరిధి ముత్తాయపాలెంలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్న విషయాలకు పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని వృథా చేసుకోవద్దన్నారు. గ్రామీణ సీఐ గంగాధర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సృజనాత్మక ఆలోచనలతో నవ్యత

బాపట్ల, న్యూస్‌టుడే: సృజనాత్మక ఆలోచనలతో విద్యార్థులు పరిశోధనలు చేసి నూతన ఆవిష్కరణలు రూపొందించాలని బాపట్ల ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణమూర్తి అన్నారు. కళాశాలలో ఫార్మసీ చివరి సంవత్సరం విద్యార్థులు రూపొందించిన ఆవిష్కరణలను శనివారం ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ ఫార్మా రంగంలో పరిశోధనలకు విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. సృజన ఉన్న వారే పోటీ ప్రపంచంలో రాణిస్తారన్నారు. కొత్త ఔషధాలు, సమ్మేళనాలపై పరిశోధనలు చేయాలన్నారు.

విద్యుత్తు శాఖ ఏఈగా బాషా

కర్లపాలెం, న్యూస్‌టుడే: కర్లపాలెం మండల విద్యుత్తు శాఖ ఏఈగా షేక్ బాషా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈయన కొల్లూరు మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న మల్లెల కుమార్ ఉద్యోగ విరమణ చేసిన విషయం తెలిసిందే.



అవార్డు అందుకుంటున్న బాజీ

ఖండాంతరాల్లో హిందీ ఉపాధ్యాయుడి ఖ్యాతి

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే: యూఏఈలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బాపట్లకు చెందిన షేక్ బాజీ 2024 టీచర్స్ ఎక్సలెన్సీ అవార్డు అందుకున్నారు. యూఏఈలోని అజ్మాన్‌లో భారత ప్రభుత్వంతో కలిసి భారత దౌత్య కార్యాలయం, దుబాయ్ సహకారంతో ఇండియన్ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో బాజీకి అవార్డును శనివారం అందజేశారు. సృజనాత్మక, నవ్యతతో కూడిన ఆలోచనలతో పాఠ్యాంశాల బోధనలో అసాధారణ సేవలు అందించినందుకు గాను ఆయనకు ఈ అవార్డు దక్కింది. గత ఎనిమిదిన్నరేళ్లుగా యూఏఈలో భారతీయ విద్యార్థులకు హిందీ బోధిస్తున్నారు. ఈ అవార్డును భారతదౌత్య కార్యదర్శి సతీష్‌కుమార్ శివన్, సీబీఎస్‌ఈ ఆర్వో, సీవోఈ డైరెక్టర్ రామ్‌శంకర్ బాజీకి అవార్డును ప్రదానం చేశారు. గుంటూరు జిల్లా పెదనందిపాడు గ్రామానికి చెందిన బాజీ కుటుంబ సభ్యులు గత పదేళ్లుగా బాపట్లలో స్థిరపడ్డారు.

కనగాల వాసుల కష్టాలు కనరే!

☛ మట్టి కాల్వల్లో ముందుకు కదలని మురుగు ☛ అధ్వానంగా పారిశుద్ధ్యం

కనగాల (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే

మండలంలోని కనగాలలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. చెత్త సేకరణ అంతంత మాత్రంగా ఉండటంతో వీధులు దుర్వాసన వెదజల్లుతున్నాయి. వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో నీరు నిలవడంతో పాటు మట్టి కాల్వలు కూడా పూడిపోయి ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతోంది. దీంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా పట్టించుకుని పంచాయతీ అధికారులు కనీసం బ్లీచింగ్ కూడా చల్లడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

పేరుకుపోతున్న నాచు

గ్రామంలోని పలు ప్రాంతాల్లో మట్టి కాల్వలు వర్షాలకు కోతకు గురికావడం, పూడిపోవడంతో మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. సరైన పారుదల లేకపోవడంతో నీటిపై నాచు పట్టి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. కొన్ని చోట్ల పశువుల వ్యర్థాలు వర్షపు నీటితో కలిసి పల్లపు ప్రాంతాల్లో నిలిచి దుర్వాసన వస్తోంది. యాదవ పాలెం, పాత పీహెచ్‌సీ బజారు, జెండా చెట్టు రోడ్డు, గౌడపాలెం ప్రాంతాల్లో సమస్య ఎక్కువగా ఉంది. మసీద్ సెంటర్‌లో ప్రధాన రోడ్డు పక్కనే తూములు మూసుకుపోయి మురుగు రోడ్డుపైకి వస్తోందని స్థానికులు అంటున్నారు. మట్టి కాల్వల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి అధ్వానంగా ఉన్నా తీసే నాథుడు లేడని ప్రజలు అంటున్నారు.



యాదవపాలెం సమీపంలో పారుదలేక నాచుపట్టిన మురుగు



మెయిన్‌రోడ్డులో మూసుకుపోయిన తూము

ఎల్లప్ప.. పూడికతీత ఎప్పుడప్పా?

గ్రామంలో తాగునీటి అవసరాల కోసం గతంలో ఇక్కడ ఎల్లప్ప చెరువును ఏర్పాటు చేశారు. ఎల్లప్ప కాల్వ ద్వారా ఇందులోకి నీరు చేరుతుంది. కానీ ఈ చెరువు మురుగుతో నిండిపోయింది. గత 50ఏళ్లుగా ఇందులో పూడిక తీయలేదు. చెరువు చుట్టూ ఉండాల్సిన కట్టలు లేవు. దీని స్థానంలో ఇళ్లు వెలిశాయి. పూడిక తీసిన మట్టి ఎక్కడ వేయాలో తెలియక పూడిక తీయడం లేదు. పూడిక తీయకుంటే గుర్రపుడెక్క, పేరుకుపోయి దోమలకు ఆవాసంగా మారింది. గడిచిన పదేళ్లలో ఈ గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలి వందల మంది విషజ్వరాల బారిన పడ్డారు. కొందరు మృతిచెందారు. గ్రామంలో పీహెచ్‌సీ ఉండటంతో సత్వరం వైద్యసేవలు అందుతున్నాయి. ఈ చెరువు పూడిక ఎప్పుడు తీస్తారో అని గ్రామస్థులు ఎదురు చూస్తున్నారు.



పూడికకు నోచని ఎల్లప్ప చెరువు

గ్రామసభలో చర్చిస్తాం

గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నాం. పక్కా కాల్వలు లేకపోవడం సమస్యగా ఉంది. ఉపాధి హామీ పథకం కింద ఎల్లప్ప చెరువు పూడిక తీయించే విషయమై గ్రామసభలో చర్చిస్తాం. నిత్యం చెత్త సేకరిస్తున్నాం. సమస్య ఉన్న చోట్ల చర్యలు తీసుకుంటాం. బ్లీచింగ్ చల్లిస్తాం. **- వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి, కనగాల**

క్షణికావేశమే నేరాలకు కారణం

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: క్షణికావేశానికి లోనై నేరాలకు పాల్పడి కుటుంబాలను మానసిక క్షోభకు గురి చేయొద్దని రేపల్లె సీనియర్ సివిల్ జడ్జి టి వెంకటేశ్వర్లు అన్నారు. రేపల్లె మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఉపకారాగారంలో విచారణ ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్ప్రవర్తన అలవర్చుకుని నేరాలు చేయకుండా సమాజంలో మంచి పౌరులుగా జీవించాలన్నారు. రిమాండ్, బెయిల్ వివిధ న్యాయచట్టాలపై అవగాహన కల్పించారు. తొలుత ఉపకారాగారంలో కల్పిస్తున్న సదుపాయాలు, ఆహార పదార్థాలు పరిశీలించారు న్యాయవాది కె శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

రైతుల చొరవతో మురుగు కాల్వ శుభ్రం

వేమూరు, న్యూస్‌టుడే: ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా, మురుగు నీటి కాల్వను శుభ్రం చేయించారా రైతులు. మండలంలో రెండ్రోజుల క్రితం కురిసిన వర్షాలకు జంపని దక్షిణం వైపు పొలాల్లో పెద్ద ఎత్తున నీరు చేరింది. దీంతో ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న వరి పైరు మరోసారి ముంపునకు గురైంది. పొలాల్లో నిలిచిన మురుగునీరు పోవడానికి కాల్వ ఉన్నా... తూటుకాడ అల్లుకుపోవడంతో నీరు ముందుకు కదలడం లేదు. అధికారులకు చెప్పినా ప్రయోజనం ఉండదని భావించిన రైతులు సొంత ఖర్చుతో కూలీలను ఏర్పాటు చేసి అర కి.మీ మేర తూటుకాడను తొలగించారు. దీంతో పొలాల్లో నీరు బయటకు చేరుతోంది.



తూటుకాడ తొలగిస్తున్న కూలీలు

సూర్యలంక రిసార్ట్స్‌కు ఉత్తమ పురస్కారం

బాపట్ల, న్యూస్‌టుడే : సూర్యలంకలో పర్యాటక శాఖ నిర్వహించే రిసార్ట్స్‌కు రాష్ట్ర ఉత్తమ రిసార్ట్స్‌గా పురస్కారం దక్కింది. సూర్యలంక బీచ్‌లో 1999లో అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో పర్యాటకశాఖ బీచ్ రిసార్ట్స్ నిర్మించారు. సముద్రపు ఒడ్డునే ఉన్న రిసార్ట్స్‌కు రెండు తెలుగు రాష్ట్రాల్లో విశేష ప్రాచుర్యం దక్కింది. 95శాతానికి పైగా ఆక్యుపెన్సీతో పర్యాటకశాఖ నడుపుతున్న ఉత్తమ రిసార్ట్స్‌గా పేరుగాంచింది. రిసార్ట్స్‌లో 32 కాటేజీలు ఉన్నాయి. కాటేజీల్లో కూర్చుని సూర్యలంక తీరంలో అందమైన సూర్యోదయం, సూర్యాస్తమయం దృశ్యాలు, పౌర్ణమి రోజున చంద్రుడు వెలుగులో పసిడి వర్ణంతో మెరిసే సముద్ర కెరటాలను వీక్షించే అవకాశం ఉండటంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి విశేష సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారు. పర్యాటక శాఖకు ప్రతి ఏటా రూ.4కోట్ల మేర ఆదాయం వస్తుంది. రెండు, మూడు నెలలకు ముందుగానే ఏసీ కాటేజీలు ఆన్‌లైన్‌లో బుక్ అవుతున్నాయి. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు చేతుల మీదుగా సూర్యలంక పర్యాటక బీచ్ రిసార్ట్స్ మేనేజర్ అశోక్ ఉత్తమ పురస్కారాన్ని అందుకున్నారు.



పురస్కారం అందుకున్న మేనేజర్ అశోక్

వెంకన్నకు ప్రాయశ్చిత్త పూజలు

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జరిగిన అపరాధానికి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా మండల పరిధిలోని కొండు భొట్లవారిపాలెం శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో జనసేన నాయకులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ ఆధ్వర్యంలో గ్రామస్థులు పాల్గొని స్వామికి అభిషేకాలు, పూజలు చేశారు. జనసేన నాయకులు విష్ణుమొలకల చంద్రమోహన్, పడమటి ధర్మారావు, సత్యనారాయణ, కె.వెంకటరామకృష్ణ, దమ్మనవారిపాలెం సర్పంచి జగ్గయ్య, వీహెచ్‌పీ పట్టణ కార్యదర్శి బండ్రెడ్డి రజనీ, గంట నాగమల్లేశ్వరి, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో జనసేన నాయకులు

ఆధార్ అనుసంధానం చేయించుకోండి

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: కొంతమంది రైతులు వారి బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేయించని కారణంగా పంట నష్టపరిహారం వారి ఖాతాల్లో జమ కాలేదని మండల వ్యవసాయాధికారి టి.బాలాజీగంగాధర్ తెలిపారు. అలాంటి వారు వెంటనే బ్యాంకులకు వెళ్లి ఆధార్ అనుసంధానం చేయించుకోవాలని ఆయన కోరారు. మండలంలో 67 మంది రైతుల ఖాతాలు మనుగడలో లేకపోవటం, 125 మంది రైతుల ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాకపోవటం వల్ల వారి ఖాతాల్లో నగదు జమకానట్లు తెలిసిందన్నారు.

పరిహారం అందలేదు.. పట్టించుకోండి

కొల్లూరు, న్యూస్‌టుడే: తమ ఇళ్లు, మోటారు వాహనాలు, పొలాలు వరద నీట మునిగినా ప్రభుత్వం ప్రకటించిన పరిహారం అందలేదంటూ గాజుల్లంకకు చెందిన బాధితులు ముఖ్యంగా మహిళలు తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు శనివారం వినతిపత్రం అందజేశారు. వరద బాధితుల జాబితాలో అవకతవకలు చోటు చేసుకోవడం వల్లే తాము పరిహారానికి నోచుకోలేదని వాపోయారు. స్పందించిన తహసీల్దార్ సచివాలయ ఉద్యోగులను పిలిచి నష్టపోయిన వారి పేర్లు నమోదు చేసి జాబితాను రూపొందించాలని ఆదేశించారు. ఉద్యానశాఖాధికారి కల్యాణ చక్రవర్తితో ఫోన్‌లో మాట్లాడి, పరిహారం అందని రైతుల ఫిర్యాదులను స్వీకరించి, పరిశీలించి వారికి పరిహారం అందేలా చూడాలని సూచించారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గాజుల్లంక బాధితులు

ఆటలతో నాయకత్వ లక్షణాలు

బాపట్ల, వేమూరు: క్రీడలతో విద్యార్థుల్లో మనో వికాసం కలుగుతుందని డీఈవో కె.నారాయణ అన్నారు. పురపాలక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ నియోజకవర్గ స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చదరంగం, యోగా పోటీలను ఆయన శనివారం ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమేనన్నారు. పురపాలక కమిషనర్ నిర్మల్‌కుమార్ మాట్లాడుతూ ఆటలు ఆడటం వల్ల విద్యార్థుల్లో శారీరక దారుఢ్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. వేమూరు మండలం జంపని ఉన్నత పాఠశాలలో అండర్-14, 17 బాల బాలికల కబడ్డీ జట్ల ఎంపిక శనివారం జరిగింది.



బాపట్ల: హోరాహోరీగా కబడ్డీ పోటీ

అథ్లెటిక్స్‌లో పొన్నపల్లి విద్యార్థి ప్రథమం

పొన్నపల్లి (చెరుకుపల్లి గ్రామీణ): మండలంలోని పొన్నపల్లి హోలియర్ వర్డల్ పాఠశాల విద్యార్థి ఎల్.నాగకేశవ మణికంఠ రేపల్లెల్లో జరుగుతున్న అండర్-14 స్కూల్ గేమ్స్‌లో సత్తాచాటాడు. బాలుర విభాగంలో 800 మీటర్ల పరుగు పోటీలో నియోజకవర్గ స్థాయిలో ప్రథమస్థానం సాధించాడని పాఠశాల కరస్పాండెంట్ శ్యాంబాబు తెలిపారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని అభినందించారు.

మార్చిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

రేపల్లె అర్బన్, కొల్లూరు, నిజాంపట్నం, చెరుకుపల్లి, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 2022లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని అధికారులు, నేతలు సూచించారు. గృహనిర్మాణసంస్థ ఆధ్వర్యంలో ఆయా మండలాల్లో మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు అవగాహన సదస్సులు శనివారం నిర్వహించారు. రేపల్లె మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో డీఈ ఏవీ సుబ్బారావు మాట్లాడుతూ పునాది నుంచి లెంటల్ స్థాయిలో ఉన్న వాటిని వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేయించాలని ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుందని తెలిపారు. కొల్లూరులో తెదేపా మండల కన్వీనర్ మైనేని మురళీకృష్ణ మాట్లాడుతూ సాంకేతిక కారణాల వల్ల లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ కాకపోతే గృహనిర్మాణశాఖ ఇంజినీరింగ్ విభాగం అధికారులను సంప్రదించాలని చెప్పారు. నిజాంపట్నం మండలం ఆముదాలపల్లిలో జడ్పీటీసీ సభ్యుడు నర్రా సుబ్బయ్య మాట్లాడుతూ ఇంటి నిర్మాణం పూర్తి చేసి సొంతింటి కల నెరవేర్చుకోవాలని సూచించారు. బొర్రావారిపాలెంలో సర్పంచి కేసన ముత్యాలమ్మ అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. చెరుకుపల్లి పంచాయతీలో తహసీల్దార్ పద్మావతి మాట్లాడుతూ వచ్చే మార్చిలోగా ఇళ్లు నిర్మించకుంటే జాబితా నుంచి పేర్లు తొలగిస్తామన్నారు.



కొల్లూరు: కార్యక్రమంలో ప్రసంగిస్తున్న తెదేపా మండల కన్వీనర్ మురళీకృష్ణ

స్వచ్ఛతతో ఆహ్లాదం

బాపట్ల, న్యూస్‌టుడే: స్వచ్ఛతతో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందని బాపట్ల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా కళాశాలల ఎన్‌సీసీ క్యాడెట్లు తహసీల్దారు కార్యాలయం ఎదురుగా మహాత్మాగాంధీ, ఎంఈవో కార్యాలయం వద్ద భగత్‌సింగ్ విగ్రహాలను శుభ్రం చేశారు. వైస్ ప్రిన్సిపల్ హరిత, ఎన్‌సీసీ అధికారి నవభాను, పీడీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మహాత్మాగాంధీ విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

ఆర్టీసీ డ్రైవర్‌పై ముగ్గురు యువకుల దాడి

బస్సులోకి ఎక్కి దౌర్జన్యం

దుగ్గిరాల, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ముగ్గురు యువకులు ఆర్టీసీ బస్సు ఎక్కి డ్రైవర్‌పై దౌర్జన్యం చేయడంతో అతడి భుజం జారిన ఘటన గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం చింతలపూడి వద్ద శనివారం జరిగింది. రేపల్లె నుంచి విజయవాడ వెళుతున్న ఆర్టీసీ అద్దె బస్సును చింతలపూడి వద్ద కళాశాల విద్యార్థులు ఎక్కేందుకు డ్రైవర్ సమ్మెట గోపి ఆపారు. అప్పటికే బస్సు ఎక్కిన వ్యక్తి వద్ద మద్యం వాసన వస్తుండడంతో ప్రయాణికులంతా అతన్ని బస్సు నుంచి దించాలని కోరారు. మహిళా కండక్టర్ కూడా అతన్ని దిగాలని సూచించినా అతడు వినిపించుకోలేదు. దీంతో డ్రైవర్ గోపి అతన్ని దిగాలని సూచిస్తుండగా అదే సమయంలో బస్సు ముందు రోడ్డుపై ఆగి ఉన్న ఆటోలో మద్యం మత్తులో ఉన్న ముగ్గురు యువకులు వచ్చి బస్సు ఆపేవేంటి? తాగారంటున్నావేంటి? అంటూ అకారణంగా డ్రైవర్‌పై దాడికి దిగారు. మద్యం సీసా, ఆటోలో ఉన్న ఇనుపరాడ్డుతో సహా వచ్చి దౌర్జన్యం చేశారు. కండక్టర్ కృష్ణవేణి, మరో మహిళ, తోటి ప్రయాణికులు వారిని ఆపేందుకు ప్రయత్నించినా ఫలితం లేదు. డ్రైవర్ చేతిని బస్సులో ఇనుపరాడ్డుకు మెలిపెట్టి బలంగా లాగారు. దీంతో అతని భుజం జారింది. అక్కడితో ఆగక నువ్వెంత? నీ జీతమెంత? అంటూ డ్రైవర్ కాళ్లు, చేతులు, ముఖంపై కొడుతుండగా కండక్టర్, మరో మహిళ తీవ్రంగా ప్రయత్నించి ఆపారు. ఈ సమయంలో తెనాలి-విజయవాడ రోడ్డులో ట్రాఫిక్ ఆగింది. చేయి సహకరించకున్నా, నొప్పితో బాధపడుతూనే ఒంటి చేత్తోనే డ్రైవర్ బస్సును దుగ్గిరాల ఠాణా వరకు తీసుకొచ్చారు. తర్వాత కారులో తెనాలిలోని ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. సమాచారం అందగానే దుగ్గిరాల పోలీసులు స్పందించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఇద్దరు తెనాలి గ్రామీణ మండలం మల్లెపాడుకు చెందిన కనపాల కిశోర్‌బాబు, కొలకలూరు నవీన్ కాగా.. ఒకరు కొల్లిపర మండలం అత్తోటకు చెందిన బేతపూడి కిశోర్‌గా పోలీసులు తెలిపారు. ఎస్సై వెంకటరవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాధితుడు గోపి

స్ఫూర్తి ప్రదాతలకు ఘన నివాళులు

బాపట్ల, బాపట్ల పట్టణం, రేపల్లె అర్బన్, భట్టిప్రోలు, అమృతలూరు, నగరం, న్యూస్‌టుడే: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన విప్లవయోధుడు భగత్‌సింగ్ కాగా తన రచనల ద్వారా సమాజంలో అసమానతలకు వ్యతిరేకంగా కలం పోరాటం చేసిన మహాకవి గుర్రం జాషువా అందరి గుండెల్లో చిరస్మరణీయులుగా నిలిచారని వక్తలు కొనియాడారు. ఆ మహనీయుల జయంతి పురస్కరించుకుని బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లోని మండలాల్లో వారి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాపట్లలో ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఎంఈవో కార్యాలయం వద్ద సద్దార్ విగ్రహానికి పూలమాల వేశారు. పురపాలక కార్యాలయంలో జాషువా విగ్రహానికి సేవా సమాజం అధ్యక్షుడు జాకబ్ తదితరులు నివాళి అర్పించారు. ఎంపీ కార్యాలయంలో జాషువా చిత్రపటానికి తెదేపా నేత తెన్నేటి శిరీష పూలమాల వేసి నివాళి అర్పించారు. ఏవీవీ ఉన్నత పాఠశాలలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి బి.రజని, హెచ్‌ఎం సత్యవతి పాల్గొన్నారు. జమేదారుపేటలోని సాహితీభారతీ కార్యాలయంలోనూ నివాళులర్పించారు. రేపల్లె అనగాని భగవంతరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాషువా జయంతి నిర్వహించారు. అమృతలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జాషువా, భగత్‌సింగ్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. భట్టిప్రోలు మండలం అద్దేపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో మహనీయుల సేవలను గుర్తుచేసుకున్నారు. నగరం శ్రీవెలగపూడి రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ అనగాని హరికృష్ణ భగత్‌సింగ్ చిత్ర పటానికి పూలమాల వేశారు.



భట్టిప్రోలు: భగత్‌సింగ్, జాషువా చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధి, ఉపాధ్యాయులు

వృద్ధుడి బలవన్మరణం

కొల్లూరు, న్యూస్‌టుడే: కంటి శస్త్రచికిత్స విఫలం కావడంతో బాధను భరించలేక కొల్లూరుకు చెందిన బొమ్మినేని అచ్చయ్య (65) పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇటీవల ఆయన ఓ కంటికి శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఆ కంటికి ఇన్ఫెక్షన్ సోకడం వల్ల కలిగే నొప్పి భరించలేక బహిర్భూమికి వెళ్లి అక్కడే పురుగుల మందు తాగి శనివారం ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు వెంటనే అతన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఏడుకొండలు తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

కొల్లూరు, న్యూస్‌టుడే: వేమూరు సర్కిల్‌లోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు పోలీసు స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లను కొల్లూరు స్టేషన్‌కు రప్పించి సీఐ వీరాంజనేయులు శనివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. నేరాలు, చట్టవిరుద్ధమైన చర్యలు, సంఘవిద్రోహ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోదరభావంతో మెలగాలని హితవు పలికారు. గౌరవప్రదమైన జీవితం గడిపాలనే వారికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

పెనుబల్లి, న్యూస్‌టుడే: ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం తుమ్మలపల్లి గ్రామ సమీపంలో శనివారం బైక్‌పై అనుమానాస్పదంగా వెళ్తున్న ఇద్దరు యువకులను అబ్కారీ అధికారులు పట్టుకున్నారు. వారి నుంచి 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ యువకులను బాపట్లకు చెందిన ఆనంద్, గుంటూరుకు చెందిన ఏసుగా గుర్తించి రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రవీణ్‌రెడ్డి, ఎస్సై ఆర్.కిషన్, హెడ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థికసాయం

అమృతలూరు, న్యూస్‌టుడే: మూల్పూరు గ్రామానికి తెదేపా కార్యకర్త గోవిందు భార్య అనారోగ్యంతో బాధపడుతూ తెనాలి వైద్యశాలలో చికిత్స పొందుతోంది. గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలేంరాజు ఆమెకు రూ.10 వేల ఆర్థికసాయాన్ని తెదేపా నేత గొట్టిపాటి గంగాధర్ చేతులమీదుగా అందజేశారు.

మాజీ ఉప సర్పంచి మృతికి సంతాపం

వేమూరు, న్యూస్‌టుడే: చంపాడు మాజీ ఉప సర్పంచి, తెదేపా నాయకుడు చుక్కపల్లి చిన్నశేషగిరి (74) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆనందబాబు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆయన మృతదేహాన్ని నివాళులర్పించారు. తెదేపాకు ఆయన అందించిన సేవలను కొనియాడారు.

కాల్వలో చెట్టు తొలగింపు

ఈనాడు కథనాలకు స్పందన

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజను ముగిసే వరకు శివారు భూములకు పుష్కలంగా సాగు నీరందిస్తామన్న జలవనరులశాఖ అధికారుల మాటలు క్షేత్రస్థాయిలో ఆచరణకు నోచుకోవడం లేదు. రేపల్లె మండలం కనగాలవారిపాలెం-బొబ్బర్లంక మధ్య ప్రధాన కాల్వలో పలు చోట్ల చెట్లు విరిగిపడి పారుదలకు అవరోధంగా మారినా ఎవరూ పట్టించుకోకపోవడమే అందుకు తార్కాణమని విమర్శిస్తున్నారు. ఇప్పటికే నల్లూరుపాలెం, సింగుపాలెం, కైతేపల్లి, తుమ్మల, పోటుమెరక, శివారు వరి పొలాలకు నీరందక ఎండుముఖం పడుతున్నాయి. దీనిపై 'అడ్డంకులిలా శివారుకు నీరెలా?' శీర్షికన ఈనెల 25న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి కాల్వలో పడిన చెట్టును తొలగించారు. సమస్య పరిష్కారం కావడంతో శివారు భూముల రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ముత్తుపల్లి పంట కాల్వ గండి పూడ్చారు

నగరం, న్యూస్‌టుడే: ఈ వారంలో కురిసిన భారీ వర్షాలకు స్థానిక శ్రీ పద్మావతి సమేత శ్రీనివాసుని దేవాలయం సమీపంలో ముత్తుపల్లి పంట కాలువకు గండి పడింది. దీనిపై ఈనెల 26న 'ముత్తుపల్లి పంట కాలువ కట్టకు గండి' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించి జేసీబీ సాయంతో శనివారం గండి పూడ్చారు. దీంతో స్థానిక రైతులు హర్షం వెలిబుచ్చారు.



'లడ్డూ వ్యవహారంలో సీబీఐ విచారణ అవసరం'

గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), భట్టిప్రోలు, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే సీబీఐ లేదా విశ్రాంత న్యాయమూర్తితో విచారణ చేయించాలని వైకాపా రేపల్లె బాధ్యుడు ఈవూరి గణేష్ డిమాండ్ చేశారు. పార్టీ పిలుపు మేరకు ఆయన శనివారం మండలంలోని గుళ్లపల్లి శ్రీగంగాబింకా సమేత ఆనందీశ్వరస్వామి ఆలయంలో స్వామికి 20 కిలోల లడ్డూ సమర్పించారు. ఆయన వెంట నేతలు కృష్ణారెడ్డి, బగ్గారెడ్డి, పాపారావు గౌడ్, నాగేశ్వరరావుగౌడ్, రవి, సుబ్బారెడ్డి, అరుణ్, బాషా, సుభానీ, కాశీ ప్రభాకర్ తదితరులు ఉన్నారు. భట్టిప్రోలు మండలం అద్దేపల్లి వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఎంపీపీ డావూరి వెంకటలలితకుమారి, వైకాపా నాయకులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఇకనైనా లడ్డూపై రాజకీయాలను తెదేపా మానుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



స్వామికి లడ్డూ సమర్పిస్తున్న గణేష్ తదితరులు

చీరాల
• చీరాల • అద్దంకి • పర్చూరు

నేడు భాజపా 'గోవు ఘోష విను'

అద్దంకి, న్యూస్‌టుడే: భాజపా ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు గోవు ఘోష విను కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కిసాన్ మోర్చా జోనల్ ఇన్‌ఛార్జి పరుచూరి శ్రీనివాసరావు తెలిపారు. కాకానిపాలెం మండపం వద్ద ఇది జరగనుందని చెప్పారు.

2న టెట్ నమూనా పరీక్ష

చీరాల, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న నేతాజీ సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత టెట్ నమూనా పరీక్ష నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు చుండూరి కృష్ణమూర్తి తెలిపారు. పరీక్ష ఉదయం 10 గంటలకు పేరాలలోని స్టార్ స్టూడియో పక్కన వీరయ్య వెంకాయమ్మ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరుగుతుందని చెప్పారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎంపీడీవో కుసుమకుమారి బాధ్యతల స్వీకరణ

బల్లికురవ, న్యూస్‌టుడే: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కె.కుసుమకుమారి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా దర్శి ఎంపీడీవోగా పనిచేస్తున్న ఈమెను సాధారణ బదిలీల్లో బల్లికురవకు కేటాయించారు.

వరద బాధితులకు సాయం



వాహనాన్ని ప్రారంభిస్తున్న ప్రతినిధులు

చీరాల, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవటానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జి.రమేష్‌బాబు, కరూర్ వైశ్యా బ్యాంకు సీనియర్ మేనేజర్ ఎన్.రామ్మోహనరావు పేర్కొన్నారు. సోషల్ సర్వీస్ గ్రూప్ ఆధ్వర్యంలో విజయవాడ సింగ్‌నగర్, వాంబేకాలనీ తదితర శివారు ప్రాంతాల్లో వరదలకు నష్టపోయిన వారికి బియ్యం పంపిణీ చేశారు. ఈ బియ్యం వాహనానికి చీరాల గడియారస్తంభం కూడలి వద్ద శనివారం జెండా ఊపి, ప్రారంభించారు. అనంతరం యిమ్మడిశెట్టి గోపాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో వాహనాల్లో అక్కడికి వెళ్లి ఐదు కేజీల చొప్పున 200 మందికి బియ్యం సంచులు అందజేశారు. కార్యక్రమంలో చుండూరి రేణుకేశ్వరరావు, కునాల పోలిశెట్టి, మోహనరాంబాబు, వైష్ణవి పాల్గొన్నారు.

బధిరుల పాఠశాల, ఎస్సీ వసతి గృహం తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి నాగవెంకటలక్ష్మి

